క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో బూర్గుడ పీడర్ పరిధిలో గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రూరల్ ఏఈ ఉర్మిల ఓ ప్రకటనలో తెలిపారు. రహపల్లివాగు వద్ద నూతనంగా టవర్ లైన్ ఏర్పాటు పనులు దృష్ట్యా చోర్పల్లి, నందుప గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

క్రీడల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవో హన్మంతు అన్నారు. రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల ప్రవేశాల కోసం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి ఎంపిక క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను 26న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. పీడీ హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో టీజీటీ, పీజీటీ, జేఎల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ శారద తెలిపారు. టీజీటీ హిందీ, పీజీటీ హిందీ, జేఎల్ సివిక్స్, జేఎల్ హిస్టరీ, టీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తమ సర్టిఫికెట్లతో పాఠశాల, కళాశాలలో ఈనెల 24న ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. అదే విధంగా మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల (కాగజ్‌నగర్) జేఎల్ ఇంగ్లిష్, టీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించడానికి అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి

దహెగాం: వనమహోత్సవంలో భాగంగా నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. గురువారం మండలంలోని దిగిడ, రాంపూర్ గ్రామాల్లోని నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు విజయ్, ప్రశాంత్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

'పోడు' పట్టాలివ్వండి

కెరమెరి: పోడు భూముల్లో సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలని మానవ హక్కుల సంఘం జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏలోని పరిపాలన అధికారి రఘురామ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు చేస్తున్న సాగు భూములకు సర్వే చేసి ఏళ్లు గడుస్తున్నా పట్టాలు రాలేదన్నారు. సర్వే చేసి రికార్డుల్లో పేర్లు నమోదు చేశారు. వారికి రైతు భరోసా కూడా అందుతుందని, కాని పట్టా పుస్తకాలు ఇంకా విడుదల చేయలేదన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

చింతలమానెపల్లి: భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ రమేశ్ తెలిపారు. మండలంలోని బాలాజీ అనుకోడ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన భూభారతి రైతు సదస్సులో ఆయన గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పలువురు రైతుల సందేహాలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. భూభారతి సదస్సులు 20న ముగుస్తున్నాయని అనంతరం రైతులు రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆర్ఐ విజయ్, సిబ్బంది జలంధర్, ప్రకాష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక పరీక్షలు

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, కోఆర్డినేటర్ తూడురు దత్తాత్రేయ తెలిపారు. సెమిస్టర్ 2, 4, 6, వార్షిక పరీక్షలు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉంటాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. సెల్‌ఫోన్, స్మార్ట్‌వాచ్ ఇతరత్రా పరీక్ష కేంద్రంలోకి అనుమతిలేదని పేర్కొన్నారు.

మధ్యాహ్నంలో రుచులు

- ప్రభుత్వ బడుల్లో నూతన మెనూ
- వారంలో ఒకరోజు కిచిడి, వెజ్‌బిర్యానీ
- విద్యార్థులకు బలవర్ధక ఆహారం



గోయగాంలో బిర్యానీతో భోజనం చేస్తున్న విద్యార్థులు

కెరమెరి: సర్కారు బడుల్లో విద్యార్థులకు బలవర్ధక ఆహారం అందించేలా ప్రభుత్వం మధ్యాహ్న భోజన మెనూలో నూతన మార్పులు చేసింది. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే చదవగలుతారంటూ నూతన మెనూ అమల్లోకి తెచ్చింది. సమ్మిళిత ఆహారంతోపాటు వారంలో ఒకరోజు కిచిడి, వెజ్ బిర్యానీ తప్పనిసరి చేసింది. విద్యార్థుల శారీరక ఎదుగుదలకు పోషకాహారం అందించాలనే సంకల్పంతో ఈ మార్పులు చేసింది. వారంలో ఒకరోజు కిచిడి, వెజ్‌బిర్యానీ తప్పనిసరిగా వడ్డించనుంది. రోజు అన్ని కూరగాయలు కలిపిన కూరలు తప్పనిసరి చేసింది. ఈనెల 12న పాఠశాలలు ప్రారంభమైన కొత్త మెనూ అమలు చేసేలా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు.

పేద విద్యార్థుల పాలిట వరం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎక్కువగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఉంటారు. వారికి సరైన పోషకాహారం అందించకపోతే శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందనే ఉద్దేశంతో మెనూలో మార్పులు చేశారు. జాతీయ పోషకాహార సంస్థ నిర్ణయించిన మెనూ పేద విద్యార్థులకు వరంలా మారింది. పోషకాహారంతో కూడిన ఆహారం అందించడం ఎదుగుదలకు ఉపకరిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు డ్రాపౌట్ల నివారణ, హాజరుశాతం పెంచేందుకు దోహదపడుతుంది. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీల్లో మధ్యాహ్న భోజనం నిర్వహించే పాఠశాలలు 85 ఉన్నాయి. వంట ఏజెన్సీ నిర్వాహకులు 111 ఉండగా.. 2,867 మంది విద్యార్థులు ఉన్నారు.

వారంలో..

సోమవారం: కిచిడి, కోడిగుడ్డు
మంగళవారం: అన్నం, సాంబారు, రాగిజావ
బుధవారం: అన్నం, ఆకుకూర పప్పు, కోడిగుడ్డు
గురువారం: ఆకుకూరలు, బిర్యానీ, రాగిజావ
శుక్రవారం: అన్నం, సాంబారు, కోడిగుడ్డు
శనివారం: అన్నం ఆకుకూర, పప్పు, రాగిజావ

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం



నూతన మెనూ విద్యార్థులకు ప్రయోజనకం. పోషకాలతో కూడిన భోజనం అందించడం హర్షనీయం. మెనూ సంబంధించిన విషయం ఇప్పటికే హెచ్‌ఎంలకు చేరవేశాం. వంట సిబ్బందికి శిక్షణ తరగతులు పూర్తిచేశాం. ఎండీఎంను పకడ్బందీగా నిర్వహిస్తాం – ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

మూడు క్లస్టర్లు..ఒక్కరే ఏఈవో

- దరఖాస్తుల స్వీకరణ..ఆన్‌లైన్‌లో నమోదు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో

పెంచికల్‌పేట్: రాష్ట్రప్రభుత్వం రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ సూచనలు, సలహాలు అందజేయడానికి వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించింది. మండలంలో మూడు వ్యవసాయ క్లస్టర్లు ఉండగా, ఒక్కరే ఏఈవో విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో 6,447 మంది రైతులు ఉన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు అర్హులైన రైతులకు అందజేయడం, క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి సూచనలు అందించడం సవాలుగా మారింది.

మండలంలో..

మండలంలో చేడ్వాయి, ఎల్కపల్లి, కమ్మర్‌గాం క్లస్టర్లు ఉన్నాయి. వీటిలో కమ్మర్‌గాం క్లస్టర్ ఏఈవో ఖాళీ ఉండగా ఇటీవల చేడ్వాయి ఏఈవో ప్రమాదంలో గాయపడటంతో సెలవులపై వెళ్లారు. ఎల్కపల్లి ఏఈవో మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల రైతుభరోసా దరఖాస్తులు స్వీకరిస్తుండగా, ఇప్పటికే పెంచికల్‌పేట్ నుంచి 101, కమ్మర్‌గాం 52, చేడ్వాయి 60 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం రైతుభరోసా, పంటల నమోదు, పండించిన ధాన్యం కొనుగోలు, ఎరువుల పంపిణీతో సతమతమవుతోంది. ఈనేపథ్యంలో తక్కువ గడువులోగా రైతుభరోసాను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం భారంగా మారింది.

ఏఈవోలను నియమించాలి



ఏఈవోలు లేక పంటల సాగు, సలహాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఖాళీగా ఉన్న ఏఈవోలను నియమించాలి. – సాధు శ్రీనివాస్, గొంట్లపేట్

ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది ఫైర్‌సేఫ్టీ నిబంధనలను పాటించాలని ఆసిఫాబాద్ ఫైర్ అధికారి కార్తీక్‌యాదవ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గురువారం సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఫైర్ సేఫ్టీ వినియోగంపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. లీడింగ్ ఫైర్‌మెన్ శ్రీనివాస్, ఫైర్‌మెన్ శ్రీకాంత్, డ్రైవర్ రాజేష్ తదతరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' బిల్లుల మంజూరు ప్రతిపాదనలు పంపండి

సాక్షి ఎఫెక్ట్..



దిగిడలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

దహెగాం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లులు సకాలంలో మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని హౌసింగ్ ఏఈ సందీప్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌లను ఇన్‌చార్జి ఎంపీడీవో అల్బర్ట్ ఆదేశించారు. మండలంలోని దిగిడను పైలట్ గ్రామంగా ఎంపిక చేసి 24 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. బిల్లులు రాకపోవడంతో గురువారం 'సాక్షి'లో 'ఇందిరమ్మ బిల్లులేవి'అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఇంచార్జి ఎంపీడీవో అల్బర్ట్.. దిగిడ గ్రామాన్ని సందర్శించారు. కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇందిరమ్మ బిల్లులు వస్తాయని లబ్ధిదారులకు భరోసా కల్పించారు. ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. మంజూరైన ప్రతి ఒక్కరు ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్–సలుగుపల్లి రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తీరుపై 'రోడ్డుపై గుంతలతో చింత'శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్పందించారు. వెంటనే రోడ్డు మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆరునెలల క్రితం సలుగుపల్లి నుంచి పెంచికల్‌పేట్ వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను శ్రమదానంతో మొరం వేసి పూడ్చామన్నా రు. గెలిచిన ఓడిన సిర్పూర్ ప్రజల సేవలోనే ఉంటామన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్సీ దండె విఠల్



ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేస్తున్న దండె విఠల్

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పట్టణంలోని వార్డు నెం 26లో లబ్ధిదారులకు గురువారం ఇళ్ల పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లు నిర్మించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేస్తోందన్నారు. పార్టీలకతీతంగా ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మాజీ చైర్మన్ దస్తగిర్, నాయకులు షబ్బీర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల్లో ప్రభుత్వ టీచర్లు



యూనిఫాం ధరించి పాఠశాలకు వచ్చిన టీచర్లు

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ఆకట్టుకునేలా వినూత్న ప్రయత్నం మొదలెట్టారు. హెచ్‌ఎం సీహెచ్ గణపతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామాగౌడ్, మహేశ్వర్‌లు యూనిఫాం దుస్తులు, ఐడీ కార్డులు ధరించి గురువారం పాఠశాలకు హాజరయ్యారు. ఉపాధ్యాయులు ఏకరూప దుస్తులు ధరించి పాఠశాలకు రావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాలలో 85 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి మెరుగైన విద్యా అందించడంతో పాటు విద్యార్థులను ఆకర్షించడానికి ఏకరూప దుస్తులు ధరించి విధులకు హాజరవుతామని హెచ్‌ఎం గణపతి తెలిపారు. ఎంఈవో హన్మంతు.. టీచర్లను అభినందించారు.

సంక్షిప్త వార్తలు

49 జీవో వెంటనే రద్దుచేయాలి

పెంచికల్‌పేట్: ప్రభుత్వం విడుదల చేసిన టైగర్ కన్జర్వేషన్ జీవో 49 వెంటనే రద్దు చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా ఏకపక్షంగా జీవో విడుదల చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం జీవో రద్దు చేయకుంటే బీఆర్‌ఎస్ పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

దహెగాం: ఆదివాసీల భూములు లాక్కోవడానికే ప్రభుత్వం తెచ్చిన 49 జీవోను వెంటనే రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ కాశిపాక రాజు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. నాయకులు శ్రీకాంత్, లక్ష్మి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సిర్పూర్(టి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని పతాంజలియోగా గురువు అశోక్ ఆర్య అన్నారు. గురువారం మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల(కాగజ్‌నగర్)లో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి యోగాసనాలు నేర్పించారు. ఈనెల 21న యోగా దినోత్సవాన్ని మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయుస్ వైద్యుడు నాగరాజుతోపాటు జోనల్ అధికారి అరుణాకుమారి, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కెరమెరి: తహసీల్దార్ కార్యాలయంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ భూమేశ్వర్, యోగా శిక్షకుడు దినేష్ పురి తదితరులున్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

పెంచికల్‌పేట్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో అల్బర్ట్ పేర్కొన్నారు. కమ్మర్‌గాం గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ స్థలాలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పంచాయతీ నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అధ్వాన రోడ్లు

- చిన్నవర్షానికి బురదమయం
- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



పిక్లాతండా నుంచి కొత్తపల్లి వరకు బురదమయంగా మట్టిరోడ్డు



వరదలతో కొట్టుకుపోయిన కిమానాయక్‌తండా బ్రిడ్జి

లింగాపూర్: మండలకేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షాలకు బురదగా మారి గుంతలు ఏర్పడుతోంది. ఆ గుంతల్లో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్ర పరిధిలోని పెద్దవాగు వద్ద అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి దగ్గర గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. నాగుగుడా బ్రిడ్జి రోడ్డుపై నుంచి వర్షపు నీరు చేరుతోంది. ఆ దారి గుండా వెళ్లే ఉపాధ్యాయులు, గ్రామస్తులు, వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అలాగే పిక్లాతండా నుంచి కొత్తపల్లి వరకు వెళ్లే మట్టి రోడ్డు, లింగాపూర్ మండలం నుంచి జాముల్‌ధరా, పూల్‌సింగ్ తండా, కీమానాయక్‌తండా, దంపూర్, ఎల్లాపటార్, పంగిడి మాధురా వరకు రోడ్లన్నీ వర్షాలకు బురదమయం అవుతోంది. బైక్‌లు బురదలో దిగబడుతున్నాయి. ఈక్రమంలో పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు. గత సంవత్సరం వరదలకు కిమానాయక్‌తండా, బ్రిడ్జి కొట్టుకుపోయింది. రెండు రోజులుగా ఎడతెరిపి వానలతో పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలు నిలిచాయి. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకుని రోడ్లు, బ్రిడ్జిలకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



మా గ్రామం నుంచి కొత్తపల్లి వరకు బీటీ రోడ్డు లేదు. వర్షాలకు రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టించుకుని బీటీ రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలి. – బానోత్ అంబాజీ, పిక్లాతండా

చర్చి ప్రతిష్ట మహోత్సవం



ప్రతిష్ఠిస్తున్న బిషప్ ప్రిన్స్ అంతోని

కౌటాల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పరిశుద్ధ వ్యాకులమాత దేవాలయ (చర్చి) ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిషప్ ప్రిన్స్ అంతోని ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలన్నారు. తోటివారితో ప్రేమ, దయ, కరుణ చూపి జీవించాలన్నారు. ఆయా గ్రామాల నుంచి క్రైస్తవులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ టోం తోమస్, మాజీ బిషప్ జోసఫ్ కున్నత్, ఫాదర్లు టోమ్ అంతోని, సీజో, శేరిన్, జోబి పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

కౌటాల: పంచాయతీల నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను పెంచాలని ఎంపీడీవో బి.రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని నర్సరీని గురువారం పరిశీలించారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, గ్రామంలో మొక్కలు నాట్టేందుకు మొక్కలను సిద్ధం చేయాలని తెలిపారు. కౌటాలలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, కార్యదర్శులు సాయికృష్ణ, అశోక్, సిబ్బంది ఉన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుకర్

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తహసీల్దార్ మధుకర్ అన్నారు. బడిబాట ముగింపులో భాగంగా మండలంలోని కడంబ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడా పోటీలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదపడుతాయన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పర్శ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, భాగ్యలక్ష్మి, సీఆర్పీ తుకారం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు




జైనూర్‌లో కేక్ కట్‌చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, నాయకులు

సిర్పూర్(టి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ నాయకులు స్థానిక బస్టాండ్ ప్రాంతంలో కేక్ కట్ చేశారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షకీల్, నాయకులు చౌదరి తిరుపతి, శంకర్, ఇప్ప రవిశంకర్, రమేశ్‌గౌడ్, సంతపురి మహేందర్, ఇనాయత్, మహేశ్, మోతీరాం, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, ఉపాధ్యక్షుడు పెందూర్ ప్రకాశ్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్‌యాదవ్, నాయకులు మెస్రం అంబాజీ, ఆడ అమృత్, కనక గంగారాం, సుద్దాల శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.

హాల్‌టికెట్లలో తప్పులు..విద్యార్థుల ఆందోళన



వివేకానంద డిగ్రీ కళాశాల సెంటర్‌గా ఉన్న హాల్‌టికెట్

కాగజ్‌నగర్‌టౌన్: కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లలో తప్పులు దొర్లడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. హాల్‌టికెట్లలో ఒక పరీక్ష కేంద్రానికి బదులుగా మరో కేంద్రం నమోదు కావడంతో అయోమయానికి గురయ్యారు. గతంలో పట్టణంలో డిగ్రీ పరీక్షల నిర్వహణకు మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ సప్లిమెంటరీ పరీక్షలకు మాత్రం వివేకానంద డిగ్రీ కళాశాలను కేంద్రాన్ని అధికారులు రద్దు చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లలో పరీక్ష కేంద్రం సదరు కళాశాల నమోదు కావడంతో ఆందోళనకు గురవుతున్నారు. కేంద్రం ఎక్కడో తెలియక కొందరు పరీక్ష రాయలేకపోయారు. పరీక్ష కేంద్రం రద్దు సమాచారం తెలియక తమ విలువైన జీవితాన్ని కోల్పోవాల్సి వచ్చిందని పలువురు విద్యార్థులు గురువారం 'సాక్షి' దృష్టికి తీసుకువచ్చారు. కాగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ప్రచార లోపం కారణంగా చాలామంది విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లి వెనుదిరిగాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయమై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవిని వివరణ కోరగా తప్పిదం జరిగిన మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని కేయూ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వివేకానంద డిగ్రీ కళాశాల సెంటర్ ఉన్న విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కెరమెరి: ప్రధానమంత్రి జనజాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ (పీఎంజూగా) అద్భుత పథకమని దీన్ని గిరిజనులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాలని ఎస్సీఆర్‌పీ రాథోడ్ నరేశ్ కోరారు. బోరిలాల్‌గూడ పంచాయతీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.